సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 15 । మార్చి । 2023

పన్ను కట్టు.. గిఫ్ట్ పట్టు



ఎటపాక : కార్యాలయానికి వచ్చి ఇంటి పన్నులు చెల్లించే వారికి అధికారులు గిఫ్ట్‌లు ఇస్తున్నారు. ఈనెల 25లోగా శతశాతం పన్నుల వసూలు లక్ష్యంలో భాగంగా కార్యదర్శి పద్మజ ఈ కార్యక్రమం చేపట్టారు.



నివాస గృహాల అప్పగింత

పెదవలసలో వైద్యసిబ్బందికి కేటాయించిన నివాస గృహాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. 10లో

పకడ్బందీగా భూముల రీసర్వే



భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. 10లో

న్యూస్‌రీల్

అన్ని రంగాల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు



ఆజాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, కళాశాల సిబ్బంది

అరకులోయ రూరల్: విద్యార్థులు అన్నిరంగాల్లో ముందు ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 3వ తేదీ నుంచి 9 వరకు నర్సాపురం వైఎన్ కళాశాలలో నిర్వహించిన జాతీయ సమగ్రత శిబిరంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థి ఆజాద్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మంగళవారం ఆయనతోపాటు సిబ్బంది అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిబిరంలో దేశవ్యాప్తంగా 210 మంది విద్యార్థులు పాల్గొనగా ఆజాద్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి

- రుణం తీర్చుకున్న కుమార్తె

రంపచోడవరం: గుండెపోటుతో అకాల మరణం చెందిన తండ్రికి చిన్నకుమార్తె తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. వివరాలిలాఉన్నాయి. రంపచోడవరంలో డ్రైవర్‌గా పనిచేసిన గోపి (42)మంగళవారం గుండెపోటుతో చనిపోయారు. రంపచోడవరం గ్రామంలో బాల్యం నుంచి ఎన్నో కష్టనష్టాలు కోర్చి చిన్న కుటుంబంతో ఎప్పుడూ ఆనందంగా గడిపిన ఆయన మృతి చెందడం స్థానికులను కలచివేసింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు వీరిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. అయితే చిన్న కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలని ఆశయంతో ఉపాధి నిమిత్తం ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. అక్కడి నుంచి వారం రోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. నారోగ్యానికి గురైన అతనిని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మగ పిల్లలు లేరు. తలకొరివి పెట్టేందుకు బంధువులు ముందుకు రాలేదు. చిన్న కుమార్తె దేవీ ప్రస్తుతం టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈరోజు కూడా ప్రీఫైనల్ పరీక్ష రాయడానికి వెళ్లిన ఆమెకు తండ్రి మరణవార్త కలిచివేసింది. వెంటనే పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. తలికొరివి పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది.

మే 7,8,9 తేదీల్లో మోదకొండమ్మ జాతర



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటపూర్ణిమ


హుకుంపేట: మోదకొండమ్మ అమ్మవారి జాతరను మే 7,8,9 తేదీల్లో నిర్వహించనున్నట్టు హుకుంపేట సర్పంచ్ వెంకటపూర్ణిమ తెలిపారు. మంగళవారం స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలు, నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువకులతో నిర్వహించిన సమావేశంలో జాతర తేదీలను నిర్ణయించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడుఇ బొంజుబాబు,కార్యదర్శిగా సన్యాసి,ట్రెజరర్‌గా ప్రసాద్,గోవింద్, గౌరవ అధ్యక్షులుగా ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, సర్పంచ్ వెంకటపూర్ణిమ, ఎంపీటీసీ రమణ, గణేష్, రాజారావులను నియమించారు. జాతర విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు.

అక్రమార్కులపై చర్యలు

- పాడేరు ఎస్టీవో, సీనియర్ అసిస్టెంట్ల సస్పెన్షన్

సాక్షి,పాడేరు: అక్రమార్కులపై ట్రెజరీ శాఖ ఉన్నతాధికారులు కొరడా ఝులిపించారు. అవినీతికి పాల్పడిన పాడేరు సబ్ ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ బాబూరావు, అశోక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించి విద్యుత్ లైటింగ్ బిల్లులు రూ.34 లక్షల చెల్లింపునకు సుమారు రూ.40 వేల వరకు లంచం తీసుకున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఇటీవల ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన ఆయన విచారణకు ట్రెజరీ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు విచారణ జరిపిన వారు ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫోకస్.. గ్రీన్



చిన్నారికి తినిపిస్తున్న పౌష్టికాహారం

- పిల్లల్లో పోషక లోపాల నివారణపై దృష్టి
- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్' ఆధారంగా పర్యవేక్షణ
- రెడ్‌లో నమోదైన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లాలో 17148 మంది చిన్నారుల్లో సమస్య

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మాతాశిశు సంరక్షణశాఖ అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ వారిలో పోషక లోపాల నివారణకు దోహదపడుతోంది. అక్కడక్కడ పిల్లలో ఆరోగ్య సమస్యలు గుర్తించిన అంగన్‌వాడీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తూ నివారణ చర్యలు చేపడుతున్నారు.

17148 మందికి తీవ్ర పోషణలోపం

జిల్లాలో పాడేరు డివిజన్‌లో 1122 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 1146 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. రంపచోడవరం (చింతూరు) డివిజన్‌లో 669 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 277 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 3214 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3 నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 93,008 మంది ఉన్నారు. వీరిలో 17148 మంది పిల్లలు తీవ్ర పోషణ లోపంతో ఉన్నారు.

పక్కాగా పర్యవేక్ష ణ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, పిల్లలు హాజరును వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే ఆహార పదార్థాల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో పాటు ప్రతి చిన్నారి బరువు, ఎత్తు పరిశీలించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల చిన్నారుల పోషణ స్థాయిలో ఎలా ఉందో తెలుసుకోవడానికి వీలు పడుతుంది.

- చిన్నారి ఎత్తు, బరువును యాప్‌లో నమోదు చేస్తే ఎత్తుకు తగిన బరువు ఉంటే గ్రీన్ చూపుతుంది. కొంచెం బరువు తక్కువగా ఉంటే ఎల్లో కలర్‌లో చూపుతుంది. అదే విధంగా తీవ్ర లోప పోషణ ఉంటే రెడ్‌లో చూపుతుంది.



క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న మాతాశిశు సంరక్షణ అధికారి

- యాప్‌లో రెడ్ కలర్‌లో నమోదై ఉన్న పిల్లలకు సంబంధించి ప్రతి రోజు పాలు, గుడ్డు, భోజనం చేస్తున్నప్పుడు పిల్లవాని వివరాలు పలకపై రాసి ఫొటోను జిల్లా గ్రూప్‌లో పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ గ్రూప్‌లో ఆయనతోపాటు, అంగన్‌వాడీ జిల్లా అధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉంటారు. ఈ విధానం వల్ల ఆయా చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం ద్వారా రెడ్ నుంచి ఎల్లో, ఎల్లో నుంచి గ్రీన్‌కు తీసుకువచ్చేందుకు పూర్తి స్థాయిలో కృషి జరుగుతుంది. అయనప్పటికీ తీవ్ర లోప పోషణతో బాధపడుతున్న చిన్నారుల గృహాలను కలెక్టర్ సందర్శించి పరిస్థితి సమీక్షిస్తారు. అనంతరం తదుపరి చర్యలు చేపడతారు.

అవగాహన కల్పిస్తున్నాం



తీవ్ర లోప పోషణ ఉన్న పిల్లల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. యాప్‌లో వారి పేరు ఎదురుగా వారి పోషణ స్థాయి నమోదు కావడంతో తెలిసిపోతుంది. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారిలో పోషక లోపానికి కారణాలను తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. దీనివల్ల తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితి మూడు నెలల వ్యవధిలో మెరుగుపడే అవకాశం ఉంది.

– సంధ్యారాణి, సీడీపీవో, రంపచోడవరం

చిన్నారుల తల్లులకు అవగాహన



చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

చింతపల్లి రూరల్: చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. పిల్లల ఎదుగుదల లోపం, బరువు తక్కువగా ఉండటానికి కారణాలపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. సీడీపీవో రమ్య, సూపర్‌వైజర్ గౌహర్ ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



పాడేరు జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి



కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో

- జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 13,414 మంది విద్యార్థులు
- అన్ని చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి,పాడేరు: ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలను ఇంటర్‌బోర్డు ఏర్పాటు చేసింది. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 13,414మంది రాయనున్నారు. వీరిలో 6753 మంది మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం 6,661మంది హాజరుకానున్నారు. పాడేరు డివిజన్‌లోని 16, రంపచోడవరం డివిజన్‌లో 10 పరీక్షా కేంద్రాలను ఇంటర్‌బోర్డు ఏర్పాటుచేసింది. వీటిలో పూర్తిస్థాయిలో బెంచీల సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అన్ని గదులకు విద్యుత్‌సౌకర్యం, ఫ్యాన్‌లను అధికారులు ఏర్పాటుచేశారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్, ఆర్ఐవో ఉమారాణి, పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తుతో పాటు భద్రత చర్యలను చేపట్టాలని ఎస్పీ సతీష్‌కుమార్ కూడా పోలీసు అధికారులను ఆదేశించారు.దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలకు సంబంధించి ఆర్టీసీ బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నామని పాడేరు డీఎం సీతారాంనాయుడు తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా అన్ని పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. పాడేరు ఐటీడీఏలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పీవో గోపాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో ఉండగా తప్పుడు ఆరోపణలు

- గొండెలి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆవేదన
- పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిపై పోలీసులకు ఫిర్యాదు



పాడేరులో కలెక్టరేట్‌లో ఎన్నికల విధుల్లో ఉన్న సచివాలయం ఉద్యోగి లకే నానిపాత్రుడు (కుడి వైపున తెలుపు రంగు షర్ట్ వ్యక్తి)

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం పాడేరు కలెక్టరేట్‌లో ఎన్నికల విధుల్లో ఉన్న తనపై మాజీ ఎమ్మెల్యే, పాడేరు టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి తప్పుడు ఆరోపణలు చేశారని గొండెలి సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నానిపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె పర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి సోమవారం ప్రెస్‌మీట్‌లో సుండ్రుపుట్టు పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నానని తనపై ఆరోపణలు చేశారని వివరించారు. మీడియాతో పాటు, సోషల్ మీడియాలోను తనపై దుష్ప్రచారం చేయడం బాధించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్నప్పుడు ఓటర్లను ఎలా ప్రభావితం చేయగలనని ఆయన వాపోయారు. కక్షపూరితంగా మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి వ్యవహరించి తన పరువుకు భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని నానిపాత్రుడు కోరారు.

విపత్తుల్లో ఆదుకునేందుకే ఆపదమిత్ర

- ఐటీడీఏ ఏపీవో శ్రీనివాసరావు

రంపచోడవరం: విపత్తులు సంభవించినప్పుడు వెంటనే స్పందించి చర్యలు తీసుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకదృష్టి సారించాయని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో 11 మండలాలకు చెందిన వందమంది వలంటీర్లకు ఆపదమిత్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఏజెన్సీ 11 మండలాల్లో ఒక్కొక్క పంచాయతీ నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి మొత్తం 100 వలంటీర్లకు ఈనెల 25 వరకు 12 రోజుల శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. వీరికి శిక్షణ కాలంలో భోజన వసతి కల్పించనట్టు తెలిపారు. ఒకొక్క రోజు ఒకొక్క శాఖపై అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల ఆశయాలకు అనుగుణంగా ఆపదమిత్రలు పనిచేయాలని సూచించారు. జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. డీఎల్డీవో డీకే కోటేశ్వరరావు, డీఎల్పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.విజయకుమార్, ఈవోపీఆర్డీ జాన్‌విల్సన్, ఈపీఎం కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన కార్యదర్శిపై ఫిర్యాదు

హుకుంపేట: పట్టభద్రుల పోలింగ్ సమయంలో విధులకు హాజరుకాకుండా గైర్హాజరైన హుకుంపేట కార్యదర్శిపై మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. దీనిపై కార్యదర్శి త్రినాథ్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. కార్యదర్శి విధులకు హాజరుకానందున రెండు పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు పడ్డామని వారు పేర్కొన్నారు.

నల్లకోటు ధరించడంలో సడలింపు

విశాఖ లీగల్: వేసవి దృష్ట్యా న్యాయవాదులకు నల్లకోటు ధరించడంలో స్వల్ప సడలింపు లభించింది. ఈ మేరకు రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి మంగళవారం తెలిపారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో న్యాయవాదులు కోటు ధరించడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని పరిగణలోకి తీసుకుని ఈనెల 15 నుంచి జూలై 15 వరకు కోటు ధరించడంలో సడలింపు ఇచ్చారు. తెల్ల ప్యాంటు, నలుపు, గ్రే కలర్ ప్యాంట్‌లను ధరించవచ్చు.

'వెలుగు' అక్రమార్కులపై చర్యలు తప్పవు

- విజయవంతంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్
- సోలార్ సిస్టమ్స్‌తో మంచినీటి సరఫరా
- స్వయం సహాయక సంఘాలకు పర్యాటక నిర్వహణ బాధ్యతలు
- ఫేస్ యాప్‌తో పెరిగిన ఉపాధ్యాయుల హాజరుశాతం
- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం: వెలుగులో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తప్పవని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. పీవోగా బాధ్యతలు స్వీకరించి ఏడాది గడుస్తున్న సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కలెక్టర్ షెడ్యూల్ బట్టి త్వరలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు. తమ ఐటీడీఏ పరిధిలో పూర్తిస్థాయిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ విజయవంతంగా జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాలకు చెందిన 13 గ్రామాల్లో సోలార్ సిస్టమ్ ద్వారా మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు, వందన్ వికాస కేంద్రాలకు సంబంధించి నిధులు గోల్‌మాల్‌పై వెలుగు సిబ్బందిపై విచారణ జరుగుతుందన్నారు. అప్పటిలో కొంత మంది ఉద్యోగులు సస్పెండ్ అయ్యారన్నారు. అయితే సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు సస్పెండ్ అయిన వారిలో కొంతమందికి పోస్టింగ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. విచారణ నివేదిక వచ్చిన తరువాత విచారణలో వెల్లడైయిన అంశాల ఆధారంగా చర్యలు తప్పవన్నారు. అక్రమాలకు పాల్పడిన కమ్యూనిటీ కోఆర్డినేటర్లపై కూడా విచారణ కొనసాగుతుందన్నారు.

పర్యాటకంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు భాగస్వామ్యం

ఏజెన్సీకి పర్యాటకుల రాక బాగా పెరిగింది.అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఏజెన్సీ ప్రాంతానికి పర్యాటకులు వచ్చేందుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పీవో తెలిపారు. గుడిసె గ్రాస్‌ల్యాండ్‌లో పర్యాటకులు వెళ్లివచ్చేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. ఐ.పోలవరం జంక్షన్ వద్ద అభివృద్ధి చేసిన పర్యాటక ప్రాంత నిర్వహణ బాధ్యతలు స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం వల్ల వారికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు.

స్కిల్స్‌పై నిర్వాసిత కాలనీల్లో సర్వే

పోలవరం ప్రాజెక్టు గిరిజన నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వారిలో స్కిల్స్‌పై సర్వే నిర్వహిస్తామని పీవో పేర్కొన్నారు. దాని ద్వారా వారి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామన్నారు. ఇప్పటికే కొంత మంది కుట్టు శిక్షణ పొందారని, వీరంతా ఒక చోట పనిచేసుకునేందుకు వీలుగా కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు సంబంధించి రెండు గిరిజన గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంది. అలాగే గిరిజనులకు భూమికి భూమి ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేస్తామని పీవో పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

ఏజెన్సీలో విద్యప్రమాణాలు పెంపుకు కృషి జరుగుతోందని పీవో పేర్కొన్నారు. ఫేస్ యాప్‌తో ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగిందన్నారు. తద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని చెప్పారు. విద్యాశాఖలో కీలకమైన డీడీ, విద్యాశాఖాధికారి పోస్టుల భర్తీ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని పీవో సూరజ్ గనోరే పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టర్ సుమిత్‌కుమార్ సమక్షంలో విద్యార్థినితో డీవార్మింగ్ మాత్రలను మింగిస్తున్న హెచ్‌ఎం మంజుల

సాక్షి,పాడేరు: పిల్లల్లో నులిపురుగుల నివారణతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా మంగళవారం పాడేరులోని శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం పిల్లలతో మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది దాటిన చిన్నారుల నుంచి 19ఏళ్ల లోపు విద్యార్థులకు మాత్రమే నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలని సూచించారు. మిగిలిన చిన్నారులు, విద్యార్థులకు ఈనెల 18వతేదీన మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 22మండలాల్లో 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రాథమిక పాఠశాలలు 3,795, కేజీబీవీలు 19, జూనియర్ కళాశాలలు 26లో ఆరు నుంచి 19ఏళ్ల లోపు విద్యార్థులు 2లక్షల 60వేల 474 మంది ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు 3,214 పరిధిలో ఒకటి నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు 47, 365 మంది ఉన్నారన్నారు. వీరందరితో నులిపురుగుల నివారణ మాత్రల మింగించే బాధ్యత వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడిబయట ఉన్న 2,368 మందికి కూడా డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమానికి 3,952 మంది ఆశా కార్యకర్తలు, 464మంది ఏఎన్‌ఎంల సేవలను వినియోగిస్తున్నామని చెప్పారు. మంగళవారం సాయంత్రం నాటికి 90 శాతం మేర మాత్రల పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. హెచ్‌ఎం మంజుల, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నులి పురుగుల నివారణ మాత్రలను మింగిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



నులిపురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: నులిపురుగుల నివారణతో ఆరోగ్యం సాధ్యమని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. స్థానిక గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆయన పిల్లలకు మాత్రలను మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనం చేసిన తరువాత మాత్రమే మాత్రలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష, డాక్టర్ నరేష్, డీఎల్పీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, మలేరియా అధికారి రామకృష్ణ, ఎంపీహెచ్‌వోలు పీటర్, సంతోష్‌రాజ్, హెచ్‌వీ సీతయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలోని గుడివాడ అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో మంగళవారం ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీవో ఝాన్సీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హౌస్‌ఫుల్

- హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన వన్డే మ్యాచ్ టికెట్లు
- ఎగబడ్డ అభిమానులు.. భారీగా క్యూలు

విశాఖ స్పోర్ట్స్: విశాఖకు క్రికెట్ ఫీవర్ వచ్చేసింది. భారత్–ఆస్ట్రేలియా సిరీస్‌లో భాగంగా ఈ నెల 19న వైఎస్సార్ ఏసీఏ– వీడీసీఏ స్టేడియంలో జరిగే డేనైట్ వన్డే మ్యాచ్ ఎప్పుడు చూసేద్దామా అని అభిమానుల్లో ఆతృత నెలకొంది. ఈ మ్యాచ్ వీక్షించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం ఇప్పటికే పూర్తి కాగా.. ఆఫ్‌లైన్‌లో మంగళవారం మూడు కౌంటర్ల ద్వారా విక్రయించారు. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్, వెలంపేటలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం , వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియానికి పిల్లలతో సైతం టికెట్ల కోసం క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. కొందరు యువతీయువకులు టికెట్ల కోసం బారికేడ్లు దూకేసి ఎగబడ్డారు. టికెట్లను పేటీఎం విక్రయించినా.. ఏర్పాట్లను మ్యాచ్ నిర్వాహక కమిటీ పర్యవేక్షించింది. టెంట్‌లతో పాటు మంచినీటి సౌకర్యం, బారికేడ్లను ఏర్పాటు చేసింది. కనీస ధర నుంచి అన్ని డినామినేషన్లలోనూ గంటల వ్యవధిలోనే టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోవడంతో.. సోల్డ్ అవుట్ బోర్డులు వెలిశాయి. కాగా.. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఫిజికల్ టికెట్లుగా మార్చుకునే వెసులుబాటును కల్పించారు. 19వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. వైఎస్సార్ స్టేడియంలో గత జూన్‌లో టీ20 మ్యాచ్ జరగ్గా, 2019 చివర్లో వన్డే మ్యాచ్ జరిగింది. భారత్‌కు అచ్చొచ్చిన స్టేడియంగా పేరొందిన వైఎస్సార్ స్టేడియం మరోసారి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో 27 వేల మంది అభిమానులతో కిక్కిరిసిపోనుంది.

11.30 గంటల నుంచే స్టేడియంలోకి...

మ్యాచ్ షెడ్యూల్ ప్రకారం రెండు గంటల ముందు నుంచే స్టేడియంలోకి ఆయా ప్రవేశ ద్వారాల నుంచి ప్రేక్షకులను అనుమతించనున్నారు. మూడున్నర తర్వాత స్టేడియంలోకి అనుమతించరు. టికెట్లను అధునాతన టెక్నాలజీతో స్కాన్ చేసి ఆయా గేట్ల ద్వారా లోపలకు అనుమతిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి తెలిపారు. ప్రవేశద్వారాల వద్ద డిస్‌ప్లే బోర్డులతో పాటు ఈసారి పబ్లిక్ ఎనౌన్స్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షిస్తున్నారు. స్టేడియంలో ఉచితంగానే మంచినీటిని అందించనుండగా... వైద్య, ఆహారపు స్టాళ్లు, పార్కింగ్ ఏర్పాట్లకు అనువుగా వైఎస్సార్ స్టేడియం మరోసారి ముస్తాబవుతోంది.



వైఎస్సార్ స్టేడియం వద్ద టికెట్ల కోసం బారులు తీరిన క్రికెట్ అభిమానులు

క్లుప్తంగా

నివాస గృహాల అప్పగింత

గూడెంకొత్తవీధి: పెదవలసలో వైద్యసిబ్బందికి కేటాయించిన నివాస గృహాలను సద్వి నియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు సూచించారు. పెదవలస పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు, సిబ్బందికోసం నిర్మించిన నివాస గృహాల్లోని ఒకదానిలో నాడు నేడు పనులు చేసే కార్మికులు ఉంటున్నారు. మరోదానిలో ఉండే హెల్త్ అసిస్టెంట్‌కు బదిలీ అయింది. ఈనేపథ్యంలో రెండింటిని సిబ్బంది సమక్షంలో ఖాళీ చేయించి వైద్యాధికారికి, మరోదానిని అంబులెన్స్ డ్రైవర్‌కు కేటాయించినట్టు ఎంపీడీవో తెలిపారు. సమాచారాన్ని ఐటీడీఏ పీవోకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం

- డీటీసీవో విశ్వేశ్వరనాయుడు


రికార్డులు పరిశీలిస్తున్న డీటీసీవో విశ్వేశ్వరనాయుడు

అరకులోయ రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా క్షయ నివారణ అధికారి(డీటీసీవో) విశ్వేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న వరల్డ్ టీబీ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో టీబీపై అవగాహన కల్పించాలని తెలిపారు.

నిఘా నీడలో వైఎస్సార్ స్టేడియం

- 19న భారత్– ఆస్ట్రేలియా వన్డే
- రంగంలోకి కే9 స్నిఫర్ డాగ్స్
- బాంబు తనిఖీ బృందాలతో స్టేడియంలో విస్తృత తనిఖీలు


స్టేడియంలో తనిఖీ చేస్తున్న కే9 స్నిఫర్ డాగ్స్ బృందం

దొండపర్తి (విశాఖ): భారత్–ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19న జరగనున్న వన్డే మ్యాచ్‌కు పోలీస్ శాఖ గట్టి నిఘా పెట్టింది. అంతర్జాతీయ ఆటగాళ్లు, ఆట చూసేందుకు వచ్చే ప్రముఖులు, క్రికెట్ అభిమానుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు భద్రతా ఏర్పాట్లు, మరో వైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు ప్రారంభించింది. మ్యాచ్‌కు మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతోంది. మైదానం లోపలే కాకుండా పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు అణువణువూ శోధిస్తున్నాయి. భారత్– ఆస్ట్రేలియా అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌ను తిలకించేందుకు విశాఖ నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు వచ్చేందుకు పోటీ పడుతున్నారు. ఈ మ్యాచ్ కోసం సుమారు 30 వేల మంది రానున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఒకవైపు ఇరుదేశాల క్రీడాకారులతో రక్షణపై ప్రత్యేక ప్రణాళికలు చేస్తూనే.. మరోవైపు మ్యాచ్‌ను తిలకించడానికి వచ్చే ప్రముఖులు, క్రీడాభిమానుల భద్రతపై దృష్టిసారిస్తున్నారు. వేల మంది క్రికెట్ అభిమానులు ఒకే సమయానికి వస్తారు కాబట్టి.. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ స్టేడియాన్ని సందర్శించి నిఘా, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. డీసీపీ–1 సుమిత్ సునీల్ గరుడ్ స్టేడియం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలపై కసరత్తు చేస్తున్నారు.

విస్తృత తనిఖీలు

మ్యాచ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో పోలీస్ శాఖ స్టేడియాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి మైదానం, పరిసర ప్రాంతాల్లోను విస్తృత తనిఖీలు ప్రారంభించింది. ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తనిఖీల కోసం ఏర్పాటు చేసిన కే9 స్నిఫర్ డాగ్స్ బృందాన్ని స్టేడియంలో తనిఖీల కోసం రంగంలోకి దింపారు. అడ్వాన్స్ యాంటీ సాబోటేజ్ చెక్ టీమ్స్, బాంబు తనిఖీ బృందాలతో క్రికెట్ పిచ్‌తో పాటు స్టేడియంలో అణువణువూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. మైదానం లోపలే కాకుండా పార్కింగ్ ప్రదేశాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

బాలుడికి అరుదైన చర్మవ్యాధి

- ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు

వీఆర్‌పురం: అరుదైన చర్మవ్యాధి(స్టీవెన్స్ జాన్సన్ సిండ్రోమ్)బారిన పడి ఓ బుద్ధిమాంద్యం గల బాలుడు నరకయాతన అనుభవిస్తున్నాడు. తన శక్తికి మించి అప్పులు చేసి మరీ ఆ బాలుడు తండ్రి వైద్యం చేయిస్తున్నా వ్యాధి నయం కాక పోవడంతో అతడు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. మండలంలోని రేఖపల్లి గ్రామానికి చెందిన యు.కరుణాకర్, నిర్మల దంపతులకు 14 ఏళ్ల బాబు ప్రసన్నరత్న, 7 ఏళ్ల పాప అమూల్యరత్నం ఉన్నారు. కరుణాకర్ అటవీ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ప్రసన్నరత్న బుద్ధిమాంద్యంతో పుట్టడంతో ఆ దంపతులిద్దరూ అత్యంత శ్రద్ధతో బాలుడిని పెంచుతున్నారు. 2009 సంవత్సరంలో ఒకసారి, 2017 సంవత్సరంలో మరో సారి రూ.లక్షలు వెచ్చించి బ్రెయిన్‌కు సంబంధించిన ఆపరేషన్లు చేయించారు. తదనంతరం స్థానిక భవిత పాఠశాలకు రోజూ తీసుకు వెళ్లడంతో బాబు ప్రవర్తనలో మార్పు వచ్చింది. చదవం, రాయడం వంటివి చేయడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రస్తుతం వీఆర్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాగా మూడునెలల క్రితం బాలుడికి జ్వరం ,నోటి పూత రావడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అనంతరం చర్మం పొడిబారడం, నోరు,కళ్లలోంచి రక్తం స్రవించడం వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో మెరుగైన వైద్యానికి బాలుడిని పలు ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాలేదు. బాబు అరుదైన చర్మవ్యాధి 'స్టీవెన్స్ జాన్సన్ సిండ్రోమ్'బారిన పడినట్టు డాక్టర్లు నిర్ధారించారు. చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చుఅవుతుండడంతో ఆ కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే బాబు చికిత్సకు లక్షలు ఖర్చు చేశామని, దాతలు ఎవరైనా కనికరించి బాబు ప్రాణాలను రక్షించాలని వారు కోరుతున్నారు. ఆర్థిక సహాయం అందజేయదలచిన దాతలు ఎవరైనా ఈ నంబర్ 9440326777 లో సంప్రదించాలని వారు కోరారు.

పకడ్బందీగా భూముల రీసర్వే

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని భూముల రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లతో భూముల రీసర్వేపై జూమ్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా భూముల సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేపై రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలన్నారు. భూముల వివాదాలు లేకుండా మ్యుటేషన్లు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వేపనులు త్వరితగతిన పూర్తి చేయాలని డీపీఎస్ సర్వే బృందాలను ఆదేశించారు. మూడు నెలల నుంచి భూముల రీసర్వే కార్యక్రమం జరుగుతున్నందున వీఆర్వోలకు ఇప్పటికే పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అవసరమైతే మరొకసారి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానికి పాడేరు,రంపచోడవరం ఐటీడీఏ పీవోలు గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాత్సవ, సర్వేశాఖ ఏడీ మోహన్ రావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జీ-20 సమ్మిట్

- ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహణ కార్యక్రమ వివరాలు వెల్లడించిన కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో సీపీ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మహారాణిపేట(విశాఖ): విశాఖలో మరో ప్రతిష్టాత్మక సదస్సు జీ–20 సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఏయూ కాన్వొకేషన్ హాలులో నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబుతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు జీ–20 సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్ విశాఖ చేరుకుంటారని.. వారికి విశాఖ విమానాశ్రయంలో మన సంప్రదాయంతో స్వాగతం పలుకుతామన్నారు. 28న ప్రతినిధుల ప్రణాళికా చర్చలు, అదే రోజు రాత్రి అతిథులకు డిన్నర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని కలెక్టర్ వెల్లడించారు. 29వ తేదీ ఉదయం యోగా, మెడిటేషన్ అనంతరం ప్యానల్ చర్చ జరుగుతుందన్నారు. 30వ తేదీ ప్యానల్ చర్చ అనంతరం జీవీఎంసీ కమిషనర్ ఎంపిక చేసిన మూడు ప్రాంతాల్లో విదేశీ ప్రతినిధులు సందర్శిస్తారని చెప్పారు. 31వ తేదీ ఉదయం సిటీ ప్లానర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు 'జనభాగిదారి' కింద వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. 18వ తేదీ ఉదయం యోగా డ్రైవ్ ఉంటుందన్నారు. 19న ఆర్.కె.బీచ్ నుంచి 3కె, 5కె, 10కె మారథాన్ నిర్వహిస్తామని.. ఇందుకోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 22న మాక్ జీ–20 సదస్సు నిర్వహణ, 24న జీవీఎంసీ ఆధ్వర్యంలో సాగర తీర స్వచ్ఛత కార్యక్రమం, 25న ఫ్రీ ఆర్ట్ కాంటెస్ట్, 26న వైజాగ్ కార్నివాల్ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ జి–20 సమ్మిట్ నేపథ్యంలో 2,350 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయం, డెలిగేట్స్ బస చేసే హోటళ్లు, వారు సందర్శించే ప్రాంతాల్లో గట్టి భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించామన్నారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నాటికి నగర సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. సుమారు రూ.100 కోట్లతో పనులు జరుగుతున్నాయని.. అదనంగా బీచ్ పార్కుల అభివృద్ధి, రోడ్లు వేయడం, మొక్కలు నాటడం తదితర పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం జి–20 సమ్మిట్‌కు సంబంధించి టీ షర్టులను విడుదల చేశారు.

160 కేజీల గంజాయి పట్టివేత

మద్రిపాలెం(విశాఖ): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పశ్చిమ బంగాకు చెందిన ఐదుగుర్ని అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఐటీఐ జంక్షన్ వద్ద కాపుగాసి గంజాయి తరలిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ సీఐ విజయ్‌కుమార్ సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పశ్చిమబంగాకు తరలిస్తున్న అల్లాద్దీన్ షేక్ , అలామిన్ షేక్ , అలేమా బీబీ, షేక్ సయ్‌ఫుల్ , షకీరుల్ ఖాన్ అరెస్టు చేసి, వీరి 6 సెల్ ఫోన్లు, రూ.7వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్ చెక్-ఇన్ కియోస్క్‌లు!


ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన కియోస్కు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కులు ఏర్పాటయ్యాయి. వీటిని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు విమానాశ్రయంలోకి ప్రవేశించే డిపాచర్ గేట్ల సమీపంలో రెండు సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కులను ప్రారంభించింది. ఇప్పటికే ఇలాంటివి రెండు కియోస్కులు ప్రీ–చెక్–ఇన్, చెక్–ఇన్ ఏరియాల్లో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ చెక్–ఇన్ కియోస్కుల వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లే విమాన ప్రయాణికుల తనిఖీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సందర్శన


అవార్డు గ్యాలరీలో స్టీల్‌ప్లాంట్ అధికారులతో ఎన్‌డీసీ బృందం

ఉక్కునగరం: నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ) బృందం మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. పర్యటనలో భాగంగా బృందంలోని 17 మంది సభ్యులు ఉదయం ప్లాంట్‌కు చేరుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఈడీ(వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా గురించి పీపీఏ విభాగం జీఎం డాక్టర్ రమాదేవి వారికి వివరించారు. అనంతరం అవార్డు గ్యాలరీని సందర్శించారు. స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. తర్వాత టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ)కు వెళ్లి.. శిక్షణ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు, వర్క్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి గోపీనాథ్ పాల్గొన్నారు.

బైకులో ఉంచిన నగదు మాయం

- గంటల వ్యవధిలో దొంగల పట్టివేత
- చోరీ కేసును 12 గంటల్లో ఛేదించిన పోలీసులు


స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం : చోరీ కేసును గంటల వ్యవధిలో ఛేదించామని డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చోరీ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన నగదు చోరీ మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో జరిగిందన్నారు. కాకినాడ జిల్లా, కోటనందూరు గ్రామానికి చెందిన చింతకాల లోవరాజు నిత్యావసర సరకుల హోల్‌సేల్ వ్యాపారి వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. లోవరాజు సోమవారం సరకులు సరఫరా చేసిన వ్యక్తుల నుంచి డబ్బులు వసూలుకు మోటార్ బైక్‌పై వచ్చాడు. నర్సీపట్నంలో దుకాణాలను చూసుకుని బైక్‌కు సైడు ఉన్న బాక్స్‌లో పెట్టుకున్నాడు. బలిఘట్టంలోని వ్యాపారి నుంచి డబ్బులు వసూలుకు లోపలికి వెళ్లాడు. ఇంతలో బాక్స్‌లో పెట్టిన రూ.9,56,000 మాయమయ్యాయి. లోవరాజు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రమణయ్య, ఎస్ఐ ధనుంజనాయుడు, గోవిందరావు టీమ్‌లుగా ఏర్పడి సీసీ పుటేజీల ద్వారా నిందితులు గొలుగొండ మండలం, కేడీ పేటకు చెందిన గంటా రవీంద్ర(30), కొత్తవలస, చీడివలసకు చెందిన మేకల ఎలియా కుమార్(18), బాల నేరస్థుడిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,36,000 నగదు స్వాధీనం చేసుకున్నామని, రవీంద్ర, ఎలియకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, వీరిద్దరూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అలాగే బాల నేరస్తుడిని విశాఖ జువైనల్ హోంకు తరలించామన్నారు. నిందితుడి వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్ సీజ్ చేశామని తెలిపారు.

రోబోటిక్స్‌లో ఏయూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఏయూక్యాంపస్: ఆంధ్రాయూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల పుణేలోని శ్రీ శివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఏయూ విద్యార్థుల బృందం పుణే, చెన్నై, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీపడ్డారు. 71 జట్లలో ఏయూ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డు లభించింది. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఎన్ఆర్ఐలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల కుమారుడు సమీర్ షేక్, సంతోష్ అందించారు. విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా వారికి ఆన్‌లైన్‌లో శిక్షణ అందిస్తూ వారికి అవసరమైన వనరులు సమకూర్చారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.

సెంటిమెంట్.. సేల్స్

- ఉపమాకలో మసాలా ఘుమఘుమలు
- తిరునాళ్లలో జోరుగా సుగంధ ద్రవ్యాల వ్యాపారం
- వెంకన్న సన్నిధిలో కొంటే ఏడాదంతా ఆరోగ్యం
- హోల్‌సేల్ ధరలకే నాణ్యమైన సరకులు


ఉపమాక తీర్థంలో విక్రయిస్తున్న సుగంధ ద్రవ్యాలు

నక్కపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న తిరునాళ్లలో మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు స్వామివారి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అప్పటి నుంచి కొత్త అమావాస్య వరకు ఆలయం వద్ద పెద్ద ఎత్తున తీర్థ మహోత్సవం(తిరునాళ్లు) జరుగుతుంది. దీన్ని చూసేందుకు వివిధ ప్రాంతాలనుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ తిరునాళ్ల మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాల క్రయ విక్రయాలకు ప్రసిద్ధి.

భక్తుల నమ్మకంతో అమ్మకాల జోరు

వెంకన్న సన్నిధిలో లభించే పసుపు, కుంకుమతోపాటు సుగంధ ద్రవ్యాలు, నిత్యావసర సరకులు కొంటే ఇంట్లో తలపెట్టిన శుభకార్యాలు నిర్విఘ్నంగా జరుగుతాయని నమ్మకం. ఏడాది పొడవునా ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవిస్తామనేది భక్తుల విశ్వాసం. వ్యాపారులు కూడా ఇక్కడ ఏడాదికోసారి వ్యాపారం చేస్తే మిగిలిన రోజుల్లో వ్యాపారం బాగుంటుందని నమ్ముతారు. దీంతో అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, తుని, రాజమండ్రి, రాజవొమ్మంగి, రంపచోడవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, సరకులు విక్రయిస్తారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చే వారు ఇక్కడి సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేస్తుంటారు.


కొనుగోలుదారులతో రద్దీగా దుకాణాలు

ఏడాదికి సరిపడా కొనుగోళ్లు

అన్ని మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు, పప్పుధాన్యాలు ఇక్కడ లభిస్తాయి. నిత్యావసర సరకులు కూడా అందుబాటులో ఉంటాయి. హోల్‌సేల్ ధరలకే వీటిని విక్రయిస్తుండటంతో ఏడాదికి సరిపోయేలా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. బయట కొనుగోలుకు ఇక్కడికి కిలోకు సుమారు రూ.50–100 వరకు వ్యత్యాసం ఉంటుందని కొనుగోలుదార్లు చెప్పున్నారు. దీనికితోడు నాణ్యత ఉంటుందని నమ్మకం. స్టీలు, ఇత్తడి, రాగి, ప్లాస్టిక్ వస్తువులు, మహిళల ఫ్యాన్సీ, అలంకరణ సామగ్రి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఏటా ఇక్కడి తిరునాళ్లలో రూ.కోటి విలువైన వ్యాపారాలు జరుగుతాయని అంచనా.

నాణ్యత.. నమ్మకం



చాలా ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్నాను. బయట మార్కెట్లో కంటే తక్కువ ధరలకే అందిస్తాం. నాణ్యత విషయంలో రాజీపడం. ఇక్కడ కొనుగోళ్లు భక్తుల సెంటిమెంట్‌తో కూడుకున్నవి. చాలా మంది ఏడాదికి సరిపడా సరుకుల్ని మా వద్దే కొనుగోలు చేస్తారు. ఏడాదిలో జరిగే ప్రతి శుభ కార్యానికీ వీటినే వాడతారు.

– కక్కిరాల శ్రీను, వ్యాపారి, ఉపమాక

స్వామి సన్నిధిలో కొనాలి



దాదాపు 30 ఏళ్ల నుంచి వెంకన్నస్వామి కల్యాణం చూడ్డానికి వస్తున్నాం. వచ్చిన ప్రతిసారీ ఇక్కడ ఏడాదికి సరిపడా సరుకులు కొంటాం. స్వామి గుడి దగ్గర కొనాలని సెంటిమెంట్. మా ఇళ్లల్లో జరిగే వివాహాది శుభకార్యాలకు వీటినే వాడతాం. మా పూర్వీకులు కూడా ఏటా ఇక్కడ సరుకులు కొనేవారట. ధరలు కూడా తక్కువే.

– సూర్యకాంతం, కొనుగోలుదారు, పెద్దాపురం